# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-04-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత సామాజిక విప్లవ ఉద్యమ పితామహుడు, ప్రముఖ సంఘసంస్కర్త మహాత్మా జ్యోతీ రావ్ పూలే జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం.**

2. **రాజధాని అమరావతిలో విద్యుత్ శాఖ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.**

3. **విద్యార్థుల ప్రతిభను గుర్తించి మెరుగుపరిస్తే వారు ఉత్తమంగా ఎదుగుతారని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి రాఘవ్ లాంగర్ పేర్కొన్నారు.**

4. **తిరుపతి - శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య నడిచే ప్రత్యేక రైలును రెగ్యులర్ చేస్తూ కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది.**

5. **దేశ వ్యాప్తంగా మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 8వ పోషణ్ పఖ్వాడా--2026 కార్యక్రమాలు జరుగుతున్నాయి.**

==========================

భారత సామాజిక విప్లవ ఉద్యమ పితామహుడు, ప్రముఖ సంఘసంస్కర్త మహాత్మా జ్యోతీ రావ్ పూలే జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం. సమాజంలో వెనుకబడిన వర్గ ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి హక్కుల కోసం పోరాడి, సాధికారతకు కృషిచేసిన జ్యోతీ రావ్ పూలే 1827 ఏప్రిల్ 11వ తేదీన మహారాష్ట్రలోని పూణే జిల్లా ఖానవలిలో జన్మించారు. తన జీవితాన్ని బలహీన వర్గాల సంక్షేమానికి అంకితం చేసిన పూలే, 1890 నవంబర్ 28న పూణేలో మరణించారు. నవసమాజ స్థాపనకు ఆ మహనీయుడు చేసిన సేవలను స్మరించుకుంటూ ఈ రోజు దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మహాత్మా జ్యోతీ రావ్ పూలే చూపిన వెలుగుబాటలో పయనిద్దామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దిల్లీలోని పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లోని ప్రేరణా స్థల్ వద్ద జ్యోతీ రావ్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల హక్కుల కోసం కృషి చేసిన జ్యోతీ రావ్ పూలే ఎప్పటికీ ఆదర్శమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సామాజిక మధ్యమం ఎక్స్ వేదికగా జ్యోతీ రావ్ పూలేకు నివాళులర్పించారు.

------------------------

రాజధాని అమరావతిలో విద్యుత్ శాఖ పనులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సీఆర్డీఏ, విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి పి.నారాయణతో కలిసి ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. రాజధాని అమరావతి పరిధిలో చేపట్టిన విద్యుత్ శాఖ పనులపై మంత్రులు ఇరువురు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. మాస్టర్ ప్లాన్ లో ఎలాంటి మార్పులు లేకుండా విద్యుత్ నిర్మాణ పనులు చేయాలని సూచించారు. రాజధానిలో హైటెన్షన్ లైన్లు మార్పిడిని అధికారులు సమన్వయం చేసుకుని పూర్తి చేయాలని ఆదేశించారు.

---------------------------

విద్యార్థుల ప్రతిభను గుర్తించి మెరుగుపరిస్తే వారు ఉత్తమంగా ఎదుగుతారని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి రాఘవ్ లాంగర్ అన్నారు. విశాఖపట్నం జిల్లా పెందుర్తిలోని పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, గ్రంథాలయం, ప్రయోగశాలలు తదితర సదుపాయాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి రాఘవ్ లాంగర్ మాట్లాడుతూ.. సాంప్రదాయ బోధన విధానాలతో పాటు నూతన పద్ధతులను అనుసరించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆడియో-విజువల్ (AV) సాధనాల సమర్థ వినియోగం, విద్యార్థుల చేతిరాత మెరుగుదల, ప్లే-వే పద్ధతుల అమలు వంటి అంశాలను తరగతి గది బోధనలో భాగం చేయాలని చెప్పారు.

---------------------------

తిరుపతి - శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య నడిచే 17439/17440 ప్రత్యేక రైలును రెగ్యులర్ చేస్తూ కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. ఈ రైలును ఈనెల 13వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ నుంచి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. ప్రతి ఆదివారం తిరుపతి నుంచి, ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్డు నుంచి రైలు బయల్దేరుతుందని అధికారులు వెల్లడించారు.

---------------------------

అమరావతి క్వాంటం హబ్‌లో భాగంగా తొలిసారిగా స్వదేశీ తయారీ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 14వ తేదీన క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడించారు. నేషనల్ క్వాంటం మిషన్లో భాగంగా దేశంలోనే తొలి కంప్యూటింగ్ వ్యవస్థను అమరావతిలో ఏర్పాటు చేయనున్నారన్నారు. టెక్నాలజీలో పరిశోధనలు, ఆవిష్కరణలకు అవసరమైన ఎకోసిస్టమ్‌ను ఈ నెల 14 నుంచి అందుబాటులోకి తెస్తున్నారని తెలిపారు. గన్నవరంలో మేథాటవర్స్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీల్లో 1ఎస్, 1ఎక్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్‌ల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయని వెల్లడించారు.

---------------------------

దేశ వ్యాప్తంగా మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 8వ పోషణ్ పఖ్వాడా--2026 కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సంవత్సరం పోషణ పఖ్వాడా 'మొదటి ఆరు సంవత్సరాల్లో మెదడు అభివృద్ధి గరిష్టంగా పెంపొందించడం' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పార్వతీపురం

మన్యం జిల్లా పార్వతీపురం మండలం డోకిశీల, పీబీ పల్లి, బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భస్థ శిశువు మెదడు అభివృద్ధిలో సరైన పోషకాహారం ప్రాధాన్యం, గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు. శిశువుల పెరుగుదలలో తల్లి మాత్రమే కాకుండా తండ్రి, కుటుంబ సభ్యులు, సమాజం సహకారం కూడా అవసరమని తెలిపారు.

-------------------------

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలు రేపు నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. విజయవాడలోని కలెక్టరేట్లో పరీక్షల నిర్వహణపై నిన్న సమీక్షించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. మూడు పరీక్షలకు మొత్తం 2 వేల 8 వందల  మంది అభ్యర్థులు హాజరుకానున్నట్టు వివరించారు. దీనికోసం విజయవాడలో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

-------------------------

కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 352 కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయాల్లో 6, 11 తరగతుల్లో ప్రవేశాలు, 7వ తరగతి నుంచి 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు  తెలిపారు. అన్ని కేజీబీవీల్లో కలిపి 32 వేల 79 సీట్లు ఉండగా.. ఇప్పటి వరకు 69 వేల 3 వందల 62 దరఖాస్తులు వచ్చాయని వివరించారు.  విద్యా సంస్థల్లోని సదుపాయాలు, అందిస్తున్న నాణ్యమైన విద్యతో దరఖాస్తులు అధిక సంఖ్యలో వస్తున్నాయని వెల్లడించారు.

-------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం సర్వర్ లో వచ్చిన సాంకేతిక లోపం కారణంగా రోజువారీ ఆన్‌లైన్‌లో జారీ చేసే శ్రీవాణి దర్శన టికెట్ల కోటాను ఈరోజు విడుదల చేయడం లేదని టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కారణంగా ఈరోజు మధ్యాహ్నం నుంచి తిరుమలలోని అన్నమయ్య భవన్ కు ఎదురుగా ఉన్న శ్రీవాణి దర్శన టికెట్ కౌంటర్ లో టికెట్లు జారీ చేస్తున్నట్లు టిటిడి ఆ ప్రకటనలో తెలిపింది. టికెట్ పొందిన భక్తులు సాయంత్రం 4 గంటలకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని పేర్కొంది.  రేపటి నుంచి యథావిధిగా శ్రీవాణి దర్శన కోటా ఆన్ లైన్ లో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది.

-------------------------

ఒడిశా, దాని పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం నుంచి తెలంగాణ, రాయలసీమ, అంతర తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఏర్పడిన ఉత్తర-దక్షిణ ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

వాయిస్...27 సెకన్లు

====================